అప్పుడు. . .

నేను కళ్లు విప్పాను.

విప్పిన కళ్లనిండా ఎర్రదనం.

కళ్లనిండిన ఎర్రదనం జీరలరూపంలో ఉంది.

నిండిన ఎర్రజీరల కళ్లతో నా ముఖం భయంకరంగా ఉండి ఉంటుంది.

భీమశంకరం మాట్లాడలేదు.

నేనూ మాట్లాడలేదు.

మెల్లిగా వెనక్కి తిరిగాను.

నిశ్శబ్దంగా ఉంది గది. గది నిశ్శబ్దంలో ఫాను చేస్తున్న చప్పుడు వినవస్తున్నది. నిశ్శబ్దపు గదిలో చప్పుడు చేస్తున్న ఫానుతోబాటు గోడ గడియారం 'టిక్కు, టిక్కు' మంటున్నది.

వెనక్కి తిరిగిన నేను మెల్లిగా నడుస్తూ గుమ్మం దాటుతుంటే, గోడకి తగిలించి ఉన్న బాపూజీ బొమ్మ నిండుగా నవ్వుతున్నది.

నిండుగా నవ్వుతున్న బాపూజీ బొమ్మ నా వెన్ను తట్టి ధైర్యం చెప్పినట్టయింది.

నేను భయపడ్డానని కాదు.

నేను భయపడలేదనీ కాదు.

ఎన్నోసార్లు భయపడ్డాను. ఎవర్ని చూసినా భయపడ్డాను. ఏం చేసినా భయపడ్డాను. ఏమీ చెయ్యకపోయినా భయపడ్డాను.

కానీ, అప్పుడు నేను భయపడలేదు.

ఆ తరవాత భయపడలేనని తెలిసిందప్పుడే.

నేను... నేను గొప్పవాడిని కాదనుకునే వాణ్ణి.

దానికి రెండు కారణాలు చెప్పగలను.

నన్నెవరూ, ఎప్పుడూ గొప్పగా చూడలేదు.

గుడ్డిగవ్వగానో, గడ్డిపువ్వుగానో ఎప్పుడూ నన్నందరూ చూసేవారు.

గొప్పగా ఎప్పుడూ అందరిచేతా చూడబడే వాళ్లలాగ నేను లేను.

వాళ్ల చేతులు కోమలంగా ఉండేవి. వాళ్ల బట్టలు మడత నలగకుండా, బురద తగలకుండా ఉండేవి. వాళ్లు అప్పుడే భోజనం చేసినట్టు ఎప్పుడూ ఉండేవారు. వాళ్ల ఇళ్లు, వాళ్ల పిల్లలు, వాళ్ల పెళ్లాలు, అప్పుడప్పుడు వాళ్ల మెడల్లో వేయబడే దండలు, తిరిగే కార్లు, చేసే షికార్లు...

ఇవన్నీ అటుంచు. నాకు వింతగొలిపే దల్లా ఎప్పుడూ కష్టపడని వాళ్ల చేతులు. మట్టి అంటని చేతులు.

నా చేతులతో నేను గాలములు పట్టుకు బళ్లు లాగాను. నేను నా చేతులతో బార్జిలకు పట్టిన తుప్పు రాలి పడేటట్టు సుత్తితో కొట్టాను. 'టక్'ని శుభ్రంగా కడిగాను. రంగులు వేశాను. నా చేతులతో బరువులు మోశాను. తెడ్లు వేశాను.

కష్టపడని ఆ చేతులు. రోజులతరబడి నేని ఉండే మా కాగితాలమీద పట్టుమని పది సంతకాలు పెట్టలేక అలిసిపోయే ఆ చేతులు. నిముక్కునే ఆ చేతులు. కారు తలుపులుకూడా తీసుకోలేని ఆ చేతులు. ఆ చేతులు గల శరీరాలు ఎయిర్-కండిషన్డ్ గదిలో కూర్చుని ఉండగా—

తడుస్తూ జోరున కురిసే వానలో, ఎండకి నెత్తి మాడుతున్నా, చలికి వణికే దేహంతో ఆ యా కాలాల్లో నేను నా చేతులతో పనిచేస్తూనే ఉన్నాను.

అందుకే నేను గొప్పవాణ్ణని ఎప్పుడూ అనుకోలేదు.

"కాసారపు పరదేశి గొప్పవా" డని ఎప్పుడూ, ఎవరూ అనలేదు.

నే నెక్కువ చదువుకోలేదు.

న న్నెక్కువ చదివించాలని మా అయ్యా, అమ్మాకూడా అనుకోలేదు. "పెద్దోరి నాగ ఇస్కూలికి సారిపోతన్నావు! నాలుగు పేడకళ్లెత్తుకు రారాదా?" అని మా అమ్మ మందలించేది. "ఉజ్జోగాలు సేసి ఈ దూ ళ్లేలేస్తాడు. పడవెక్కి నాతో రారా అంటే గుంటనచ్చినోడు కాతరు సెయ్యడు. ఈ ఏడయినా పరీచ్చ పోదా! నా సీడి సదువు మానిపించి సముద్రంమీదికి తీసుకెళ్లనా" అనేవాడు మా అయ్య.

మా అయ్య జీవితంలో ఎన్నో అనుకున్నాడు. కాని, అనుకున్న వాటిలో కల్లా ఖచ్చితంగా జరిగింది నా శిష్టసారం పరీక్ష పోగానే చదువు మానిపించెయ్యడమే.

తక్కువ చదువుకోవడంవల్ల ఎక్కువ మోపాలు చెయ్యడంగాని, ఎక్కువ జీతాన్ని తక్కువ శ్రమతో సాధించడం గాని నా వల్ల కాలేదు.

సముద్రంమీదకి మా అయ్యతో బాటు నాటుపడవలో చేపలు పట్టడానికి వెళ్లినన్నాళ్లు, వెళ్లిన తరవాత సముద్రం మీదే నా కుద్యోగమైంది.

నా కెందరో పెళ్లాలు లేరు.

పెళ్లాం ఒక్కతే ఉంది.

ప్రియురాళ్లు లేరు నాకు.

ఆడది, పెళ్లాం ఒక్కతే నా జీవితంలో.

అలాంటి నా ఆడది నీళ్లు పోసుకుంది.

మా అమ్మకి అంతులేని సంబరం కలిగింది.

మా అయ్య నన్ను చూసి కమ్మగా నవ్వి మీసం మెలేశాడు. చిన్నది చెల్లి ఒకటే నేరాకోరాలు. నేలకంటుకుని ఉన్న గుడిసెలో మేమున్నా, మా మనస్సులు గువ్వపిట్టల్లా ఎగిరాయి ఆకాశంలో. సిగ్గుతో ముద్దుల మూట గట్టిందా రాత్రి నా భార్య.

నెలలు నిండిన నా పెళ్లాం మొన్న పొద్దున్న మందుసీసా పట్టుకుని ఆస్పత్రికి వెళ్లింది రంగునీళ్ల కోసం.

మళ్లీ నేను దాన్ని ఆ సాయంకాలం ఆస్పత్రిలోనే చూశాను.

మంచంమీద పడుకుంది.

వడిలిపోయిన దండలా ఉంది.

కమిలిపోయిన కలువలా ఉంది.

మూలుగుతున్న నా పెళ్లాం మన లోకంలో లేనట్టుంది.

అప్పుడు చూశాను నేను దాని కుడి కాలు, బారగా లొచ్చినట్టు వాచి ఉండడం. తెల్లని బాండేజీలు కట్టబడి అరటిదువ్వలా ఉంది.



"కాన్పులో తప్పిందిగాని కడుపులో పిండం పోవలసిందే" అంది నర్సు.

నాతో పనిచేస్తున్న నూకరాజు—

"బాబోరే! సచ్చి బతికినాది. దొరగోరి కారు దాని కాలుమీద నుంచి పోయినప్పుడు నే నక్కడే కదా ఉన్నాను? ఇదేమో నిండు నూలాలు. అడుగులో అడుగేసుకుంటా నడుస్తాంది, గేటు దగ్గిర కాలవమీద గజాలపైనుంచి. సర్రు నొచ్చింది దొరగోరి కారు. వడన వాగుంది. 'బాంయ్'మని హారనేనా నొక్కలేదు. దొరగోరు కారు నడవడం ఇపుడిపుడే గదా నేర్సుకుంటన్నారు? ఏటయిపోయిందో ఏటోగాని గబుక్కున నీ పెళ్ళాన్ని గుద్దేసి, కుడికాలుమీదుగా నెనకసక్రాలు పోయి ఆగిపోనాది. చిత్తరసూపులు సూన్నాక దొరగోరు దిగినారు" అన్నాడు.

"పాపం, చిన్నగే జాలి పడ్డాడనుకో. ఎవురంమట్టుకు ఏటి సేస్తాం? ఇదేటి అనుకుని సేసిందా ఏటి? బా బసలే గాభరా గాభరాగున్నాడు ఆ సిటంనుంచి" అన్నాడు సత్తెయ్య.

నే నంతా విన్నాను. నిజమే. ప్రమాదాలు ఎన్నో జరుగుతుంటాయి. ఏవన్నేమంటాం?

మర్నాడు నేను మామూలుగానే డ్యూటీకి వెళ్ళాను. మనసులో మాత్రం మూలుగులే వినబడుతున్నాయి. కనుల ముందు కనబడుతూంది వాచి ఉన్న కుడి కాలు. వెళ్ళిన గంటకల్లా కబురొచ్చింది— "చిన్న దొరగారు పిలుస్తున్నా"రని.

భీమశంకరంగారు కుర్చీలో కూర్చున్నారు. నమస్కారం పెట్టి నిలుచున్నాను. "ఊఁ నీ ఆవిడకి ఎలా ఉంది?" అన్నా రాయన.

నా కళ్ళలో నీళ్ళు తిరగబోయాయి. బలవంతాన ఆపుకున్నాను. వంచుకున్న తలలో ఎన్నో ఆలోచనలు రేగాయి.

'బాబు! దొరబాబు తరవాత దొరబాబు! వారి కారు నా పెళ్ళాం కాలు మీదనుంచి పోతే ఏంగాక! అది చావు రేవునుంచి ఒడ్డుకి విసరబడ్డా ఇంకా నరకయాతన అనుభవిస్తుంటే ఏంగాక! మనిషిని కబురు పెట్టి మంచీ, చెడ్డా కనుక్కుంటున్నారు. దొరగారే చెప్పి ఉంటారు. అసలు ఆస్పత్రికే వద్దామని అయనకు ఉండే ఉంటుంది. తీరికలేక చిన్నదొరగార్ని విషయాలు కనుక్కోమని చెప్పి ఉంటారు. ధర్మరాజా!'

భీమశంకరంగారు దగ్గారు. నేను తలెత్తాను. నోట్లో వెలుగుతున్న సిగరెట్టు పొగ విడిచారు. టేబిల్‌మీద పేపర్ వెయిట్ కదిపారు. కాస్సేపు ఇబ్బందిగా చూసి, "పోలీస్ కంప్లెయింట్ ఇచ్చావా?" అని అడిగారు.

నాకు వెంటనే వారేమంటున్నదీ అర్థం కాలేదు.

**జీవితం చదరంగం వంటిది. ఆ పరమపద సోపానంలో ఏ పాము ఏ సమయంలో నోరు తెరుస్తుందో తెలియదు. తెలియనంతవరకూ భయంలేదు మనిషికి. భయపడుతూ మరొకరి నీడన రోజులు గడిపే మనస్తత్వం రక్తంలో జీర్ణించుకొన్నంత కాలం తనకు జరిగే అన్యాయాన్ని వేలెత్తి చూపే ధైర్యం ఉండదు. అలాటి ధైర్యం అలాంటివాడిలో మేలుకొన్ననాడు అధికారపు అహంకారానికి రోజులు దగ్గర పడినట్లే మరి.**

మనం వెయ్యలేని ఊహలు వెయ్యబట్టే వారు గొప్పవా రయ్యారని నా కిప్పుడు తెలిసింది.

నిజం చెబుతున్నాను—

నా పెళ్ళాం కాలుమీదనుంచి దొరగారి కారు పోయి అది ఆస్పత్రిలో చేరితే పైడమ్మ తల్లిని వేడుకున్నాను — నా పెళ్ళాన్ని బ్రతికించమని, కడుపులో ప్రాణిని దక్కించమని.

నాకు పోలీస్ స్టేషన్ జ్ఞాపకం రాలేదు. ఫిర్యాదు చెయ్యవచ్చని తోచలేదు. దేవుడు చేసిందానికి మనిషిని నిందించి ఏం ప్రయోజనం అని మాత్రం అనిపించింది.

భీమశంకరంగారు— "జాగ్రత్త. కంప్లెయింటు మాత్రం ఇచ్చేవు!" అని, ఇంక వెళ్ళిపొమ్మన్నట్టు చూసినప్పుడు నా క్కొంచెం బాధనిపించింది. "చిత్తం" అని తల ఊపి వచ్చేశాను.

రోజల్లా పనితో అయిపోయింది. ఆలోచనకి తావియ్యని పని. సాయంకాలం డ్యూటీ దిగి పోతుంటే మళ్ళీ కబురొచ్చింది.

**మల్లాప్రగడ రామారావు**

ఈసారి కనబడని చిరాకుతో బయలుదేరాను దొరగారి ఆఫీసుకి. 'ఉదయం చెప్పారు కదా ఫిర్యాదు చెయ్యవద్దని? ఇప్పుడు కాస్త మంచీ, చెడ్డా కనుక్కుంటారేమో' నన్న ఆశతో వెళ్ళాను.

భీమశంకరంగారు నవ్వుతూ ఎవరితోనో టెలిఫోనులో మాట్లాడుతున్నారు. అయిదు నిమిషాలకి నా ఉనికిని గుర్తించినట్టు నా వైపు చూస్తే, "నమస్కారం, సార్!" అని ఎప్పటిలాగే చేతులు కట్టుకుని నిలుచున్నాను.

"దొరగారు మళ్ళీ చెప్పమన్నారు— పోలీసు కంప్లెయింటు ఇవ్వద్దని."

నా కీసారి మాట్లాడాలనిపించలేదు.

"ఏం అర్థమయిందా?" అన్నారు.

అన్నీ అందరికీ ఒక్కలా అర్థమవవు, కనబడవు ఒక్కలాగ.

నాకు నా పెళ్ళాం కోలుకోవాలన్న ఆత్రత.

శంకరంగారికి దొరగారే చిక్కుల్లోనూ పడగూడదని ఆత్రత.

కాలుమీదనుంచి కారు పోతే, కారు పోనిచ్చిన దొరగారిమీదే అందరికీ సానుభూతి.

నేను తల ఊపి వచ్చేశాను.

ఈవేళ సముద్రం పోటుమీద ఉంది. వానకూడా పడుతున్నది. తడుస్తూనే పని చేస్తున్నాను. మళ్ళీ కబురొచ్చినప్పుడు మండుకొచ్చింది.

వెళ్ళాను.

నమస్కారం పెట్టాను.

తల వంచుకు నిలుచున్నాను.

కాలికి మృదువుగా తివాచీ తగులుతున్నది. చలికి శరీరం వణుకుతున్నది. పైన ఫాను గరగర మంటున్నది.

విప్పిన పెదాలలోంచి అవే మాటలు.

"నువ్వు బ్రతికఉన్నంతసేపూ నీ నెత్తిమీద ఎవడో నిలుచున్నట్టే ఉంటుంది. ఏం చేద్దామన్నా ఆ నెత్తిమీద వాడు ఎక్కడ మొట్టుతాడోనని జంకుతూనే ఉంటావు. ఈవేళ వాడి కెదురు చెప్పొననుకో— ఎక్కడ నిన్ను దొంగదెబ్బ తీస్తాడోనని జంకు.

అయినా నేను 'చిత్తం' అనలేదు. తల ఊపలేదు. సమాధానం చెప్పలేదు.

"నా పెళ్ళాం యమయాతన పడుతోంది. నా మనసంతా దానిమీదే ఉంది. నువ్వు న్యాయం మరిచి, ధర్మం విడిచి, నేనూ మనిషినని విస్మరించి, చేసిన హెచ్చరికే మళ్ళీ చేసి, చెప్పిన సమాధానమే మళ్ళీ మళ్ళీ చెప్పించుకోవాలని చూస్తున్నావు.

నా బాధ నీకు తెలియదు. తెలియనూ నద్దు. నాకు కావలసింది లేదు. కార్లు నా మీద నుంచి, నా వాళ్ళ మీదనుంచి పోకుండా ఉంటే చాలు. పోనీ, పోనిచ్చావు— అంతటితో వదిలేయరాదా!" అందామను కున్నాను.

అప్పుడే భీమశంకరంగారు "మొద్దులా నిలుచుని మాట్లాడవేం?" అని గద్దించారు.

నా కేమయిందో నాకు తెలియదు.

అంతవరకూ మూసుకున్నాయని కాదు కాని, కోపంతో తెరుచుకున్నాయి నా కళ్ళప్పుడు.

దించుకున్న తల పైకెత్తాను.

కళ్ళు విప్పాను.

విప్పిన కళ్ళనిండా ఎర్రదనం.

కళ్ళనిండిన ఎర్రదనం జీరల రూపంలో ఉంది.

నిండిన ఎర్రజీరల కళ్ళతో నా ముఖం భయంకరంగా ఉండి ఉంటుంది.

భీమశంకరం మాట్లాడలేదు.

నేనూ మాట్లాడలేదు.

వెనక్కి తిరిగి వచ్చేశాను.

గుమ్మం దాటి వస్తుంటే నా నెత్తిమీద ఎవరూ లేనట్టు నా కానందం వేసింది.

నా కాళ్ళక్రింద ఏ ఒక్కరిదీ కాని భూమి.

నా నెత్తిమీద అందరికీ చెందిన ఆకాశం.

నన్ను తాకుతూ విశ్లేడలా ఉన్న గాలి.

ఎదురుగా అలలు లేస్తూ, పడుతూ



భూమి నంతటినీ కౌగిలించి ఉన్న సముద్రం.

అప్పుడు—

నాకు ఉద్యోగం గురించి భయం వెయ్యలేదు.

వెయ్యలేదు భయం జీవితం గురించి.

భయం నాకు భయపడి పారిపోయినా, నా కో అనుమానం మిగిలిపోయింది— 'నే నొక్కడిని కళ్ళు విప్పితేనే ఇలా ఉందే, నా లాటి వాళ్ళంతా మేలుకుంటే ఏమవుతుందా' అని. ★